# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–3 30, అక్టోబరు, 2014

జూడాల సమ్మె విషయంలో శుక్రవారం కోర్టు తీర్పు వెలువడే అవకాశం ఉన్నందున, కోర్టు తీర్పు వచ్చిన తరువాతే ప్రభుత్వ పరంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. హైకోర్టులో గురువారం జూడాల సమ్మెపై విచారణ ముగిసిన తరువాత డిప్యూటి సిఎం డా.టి.రాజయ్య, డిఎంఇ శ్రీనివాస్ తదితరులు ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జూడాల సమ్మె విషయాన్ని సమీక్షించారు. జూడాలు వెంటనే విధుల్లో చేరాలని ఇప్పటికే ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. గురువారం లోగా చేరకపోతే చర్యలు తీసుకొంటామని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. జూడాలు సమ్మె చేస్తున్నారని, వారు సమ్మె విరమించకుంటే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందనే విషయాన్ని కూడా అధికారులు జూడాల తల్లిదండ్రులకు పంపిన లేఖలో స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ పిలుపును అందుకుని చాలా మంది జూడాలు విదుల్లో చేరారు. గురువారం మధ్యాహ్నం వరకు అందిన సమాచారం ప్రకారం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో వంద మందికి పైగా జూనియర్ డాక్టర్లు విధుల్లో చేరారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇప్పటికే పోస్టింగ్ పొందారు. వారు కూడా దాదాపు 750 మంది వరకు ఉన్నారు. వారిలో కూడా చాలా మంది గురువారం విధుల్లో చేరారు. గడువు పూర్తయ్యేలోపు విధుల్లో చేరే వారి సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి జూనియర్ డాక్టర్లు విధుల్లో చేరుతుండటం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జూడాలు సమ్మె విరమించి విధుల్లో చేరి తమ బాధ్యతలు నిర్వహించాలని ముఖ్యమంత్రి మరో సారి కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత సానుభూతితో వ్యవహరిస్తోందని, విధులు నిర్వహించే జూడాల పట్ల కూడా ప్రభుత్వం అదే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు.

గడువులోగా విధుల్లో చేరని జూడాల విషయంలో ఎలా వ్యవహరించాలనే విషయంపై కూడా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. జూడాల సమ్మె నేపథ్యంలో 2005 నుండి

ఇప్పటి దాకా నాలుగు సార్లు ఎస్మా ప్రయోగించారు. జూడాలు సమ్మె చేయకుండా 2013 ఆగష్టు 17న ప్రభుత్వం జిఓ నెం. 1022 కూడా విడుదల చేసింది. ఈ జిఓ ప్రకారం హౌస్ సర్జన్లు, పిజి విద్యార్థులు, సీనియర్ రెసిడెంట్స్‌లు సమ్మె చేయకుండా నిషేధం విధించారు. సమ్మెలో పాల్గొని విధులకు గైర్హాజరయ్యే జూడాలను కోర్సు నుండి డిబార్ చేసే అధికారాన్ని కూడా ఈ జిఓ ప్రకారం అధికారులకు ఇచ్చారు. ఎస్మా ప్రయోగించడం, డిబార్ చేయడం అనే రెండు రకాల చర్యల విషయంలో ప్రభుత్వం ఎదో ఒక దానిని ఎంచుకోవాలని నిర్ణయించారు. విధులకు హాజరుకాని జూడాలను డిబార్ చేయడమే సరైన చర్య అని ముఖ్యమంత్రి భావించారు. అయితే ఏ చర్య తీసుకోవాలనే విషయంలో ముఖ్యమంత్రి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. హైకోర్టు జూడాల సమ్మె విషయంలో తీర్పు వెలువరించాల్సి ఉంది. వాదనలు పూర్తయ్యాయి. హైకోర్టు తీర్పు రిజర్వులో ఉంది. తీర్పు వెలువడిన తరువాతే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. విధులకు హాజరై ప్రజలకు సేవ చేసే వారి సమస్యలు పరిష్కరించే విషయంలో ఉదారంగా ఉండాలని, విధులకు హాజరుకాని వారి విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. భవిష్యత్తులో మళ్లీ ఈలాంటి సమస్య రాకుండా విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో చేరే సమయంలోనే రెండేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తామని అఫిడవిట్ దాఖలు చేసే నిబంధన కూడా పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. దేశంలో అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో ఖచ్చితంగా పనిచేస్తారని, జూడాలు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయము అని మొడి పట్టు పట్టడం మంచిది కాదని ముఖ్యమంత్రి అన్నారు. ఐఎఎస్, ఐపిఎస్ చదివిన వారు కూడా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని జూడాలు ఎందుకు చేయరని ముఖ్యమంత్రి అన్నారు.

---------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం